


నిద్ర మెలకువ వస్తూండేసరికి 'కౌసల్యా సుప్రజారామ!' అని లోపలినించి శ్రావ్యంగా వినిపిస్తూంది. కనులు తెరవకుండా అలానే పడుకుని వింటూన్నాడు రాధాకృష్ణ. వదినె ఎంతో చక్కగా పాడుతుంది. ఎంతసేపు విన్నా ఇంకా వినాలనే అనిపించే కమ్మని గొంతు ఆమెది. ఏ రాగం ఆలపించినా అది ఆమె గొంతులో కొత్త అందాలు నింపుకుని హొయలు పోతుంది. తను స్కూల్లో చదువుకునే రోజుల్లో ఆమె గొంతు ఎక్కడున్నా వినిపిస్తే చదువుతూన్న పుస్తకం, చేస్తున్నపని వదిలేసి బొమ్మలాగా వింటూండి పోయేవాడు.

కళ్ళు మూసుకు పడుకున్న రాధాకృష్ణకు పక్కమీది నించి లేవ బుద్ధి వెయ్యలేదు. పూజగదిలోంచి వదిన గొంతు, గాలిలో తేలివస్తున్న అగరువత్తుల కమ్మని వాసనా అన్నీ. గతం తలపుకు తెచ్చాయి. తను ఫోర్తుఫారం చదివేటప్పుడు వదిన కాపరానికి వచ్చింది. తనకన్న ఒక ఏడాదో, ఏమో పెద్దది మహా అయితే. ఇంట్లో అందరు పెద్దవాళ్లు అవటంతో తనతో స్నేహం ఏర్పడ్డది వదినకు. అన్నయ్య ఇంట్లో లేనప్పుడు తనను కవ్వించి స్కిప్పింగ్, మధ్యాహ్నం అందరు నిద్ర పొయ్యేవేళ తొక్కుడుబిళ్లా ఆడి తనను ఏడిపించేది. కాని తనకు చదరంగం ఆట నేర్పిన ఘనత మాత్రం వదినదే. చదరంగం అంటే తనకి ఎంతో ఆసక్తి ఏర్పడేటట్టు చేసింది. ఆ ఆసక్తే తనకు కాలేజీలోనూ యూనివర్సిటీలోనూ కూడా ట్రోఫీలూ, కప్పులూ సంపాదించి పెట్టింది. అసలు మొట్టమొదటిసారిగా వదినే తనను "రాధా!" అని పిల్చింది. అది తను స్కిప్పింగ్‌లో ఓడిపోయిన మొదటిసారి. తనకి చెమటలు పట్టి ఓడిపోయినందుకు ఉక్రోషంతో ముఖం ఎర్రగా కందగడ్డలా అయిపోతే తనను వెనకనించి "రాధా!" అని పిలిచింది వదిన. అసలే ఓడిపోయినందుకు ఒళ్లు మండిపోతుంటే తనను "రాధా" అని పిలిచినందుకు ఒళ్ళు చుర్రుమన్నది. ఉడుకుమోతుతనంతో గిరుక్కున వెనక్కి తిరిగాడు. ఏదో అనాలని కసి. ఏమనాలో తెలియని నిస్సహాయత. తన ఉడుకుమోతుతనం చూసి వదినె పకపక నవ్వింది. "ఎందుకోయ్ అంత కోపం!" అన్నది కొంతసేపటికి నవ్వు ఆపుకుని.

తనకి ఎలా జవాబు చెప్పాలో తెలియటం లేదు. కాని తీవ్రంగా ఘాటుగా జవాబు చెప్పాలనుకుంది. ఏం చెప్పాలి? ఎలా?

"ఓడిపోయినందుకు అంత కోపం అయితే ఎలా! ఆడపిల్లతో సమానంగా స్కిప్పింగ్ చెయ్యలేనివాడివి నువ్వు స్కూల్లో ఏం ఆటలు ఆడతావోయ్ రాధా?"

"అదేం కాదు."

"మరి?"

“[illegible] నువ్వు రాధా అని పిల్చినప్పుడల్లా ఆ పేరంటే నాకు ఎంత ఇష్టమో తెలుసా! ఇవాళ రోషంతో ఎర్రబడ్డబుగ్గలతో నిన్ను చూస్తూంటే నా క్లాసుమేటు రాధామణి గుర్తు వచ్చింది. అది కోప్పడినప్పుడుకూడా ముమ్మూర్తులా అచ్చు నీ లాగే ఉంటుందనుకో. కాకపోతే నీకు కొంచెం నూనూగు మీసాలు వస్తున్నాయి అంతే.” వదినె నవ్వుతూ అన్నది.

వదినె అంత బరితెగించి మాట్లాడుతూంటే తనకు నోట మాట రాలేదు.

“పోనీలే నీ కంత కోపం అయితే అలా పిలవటం మానేస్తా” అన్నది తనే మళ్లీ.

“నీ ఇష్టం వచ్చినట్లు పిల్చుకో. నువ్వు పిల్చినంత మాత్రాన నేను ఆడదాన్నికాను” అంటూ తను ఇవతలికి వచ్చేశాడు.

అంటే ఆనాటినించీ ఈనాటిదాకా తన పేరు “రాధ”. వదినని చూసి ఇంట్లో మిగతావాళ్లుకూడా తనని అలాగే పిలవటం మొదలు పెట్టారు.

తరవాత తను బియ్యే చదవటం ఎం. ఏ. చదవటానికి మద్రాసు వెళ్లిపోవటం త్వరత్వరగా జరిగిపోయాయి. ఎం. ఏ. లో తనకి క్లాసు రావటంతో అదృష్టవశాత్తు ఫుల్‌బ్రైట్‌స్కాలర్‌షిప్ రావటంతో అమెరికావెళ్లి పోవటం, డాక్టరేటు పుచ్చుకొని తిరిగి రావటం అన్నీ చకచకా జరిగిపోయాయి. యూనివర్శిటీలో చేరటానికి ఇంకా వారం రోజుల వ్యవధి ఉంది.

“బాబాయ్!” చెవి దగ్గిర నానిగొంతు వినిపించింది. “ఊఁ...” అంటూ మత్తుగా పడిలి చెయ్యి చాపేడు. మెత్తగా నానిగాడి బుగ్గ తగిలింది చేతికి.

“ఏమయ్యా రాధా! లేచి ముఖం కడుక్కుంటావా? లేకపోతే బెడ్‌కాఫీ తెమ్మంటావా?” వదినెగొంతు.

తను నవ్వుతూ కళ్లు తెరిచాడు. గుమ్మం దగ్గిర వదినె మంచునుంది. మంచుతెరలాంటి తెల్లచీరె, దూముడివేసిన జుత్తు. బోసిపోతున్న మెడ. చేతికి ఒక జత బంగారుగాజులు. పూజారితలువులు వేసుకు పోయినా భౌతికఅభ్యంతరాన్ని ఛేదించుకుని దిగంతాలలో స్వామిని వెతికేవాళ్లా. అలా నించున్న వదినని చూస్తూంటే ఎండాకాలం తరవాత తొలకరి చినుకులు పడినట్లుంది రాధకు.

“నీ ఇష్టమేదో ముందరే చెప్పావుగా వదినా!” అన్నాడు పక్కమీదినుంచి లేస్తూ.

“అయితే కానీ మరి త్వరగా. . .” అంటూ లోపలికి వెళ్లింది అబల.

“చిన్నాన్నా, చిన్నాన్నా క్రికెట్ ఆడుకుందాం రావా!” నానిగాడు బతిమాలేడు.

“అప్పుడేనా? నువ్వు పాలు తాగేవా?”

“ఓ! నేను నీ కంటే ఎంతోముందు లేచా. స్నానం చేసి పాలు తాగా. . . పిన్నిగారి అలివేణి నేనూ అన్నాలాటగూడా ఆడుకున్నాం” నానిగాడు హుషారుగా చెబుతున్నాడు.

“అలాగా! అయితే ఉండుమరి! నేను కాఫీ తాగద్దూ!”

“కాఫీ తాగి ఆడతావా?”

“ఊఁ. . .”

“వెరీగుడ్డు. వెరీగుడ్డు. . .” చప్పట్లు చరుచుకుంటూ ఇంట్లోకి పరిగెత్తాడు నాని.

టవల్ బుజాన వేసుకుని బాత్‌రూంవైపు నడిచాడు.

పూవులో దాగిన మకరందాన్ని ఒక మధుకరుడు తాగి వెళ్ళిపోయినా, పూవు శోభ తగ్గినట్లు కనిపించదు. కాని మరొక మధుకరుడు భ్రమతో ఆ పూవును సమీపిస్తే, మకరందం లభించకపోగా, నిరాశ మిగులుతుంది. అందుకే పూవును పూబోడితో జత చేస్తారు.

రాధాకృష్ణ.

* * *

ముఖం తుడుచుకుంటూ వచ్చేసరికే వంటింట్లో పీటవేసి పళ్లెంలో ఇడ్లీలూ, నెయ్యివేసిన కారంపొడీ ఆహ్వానిస్తున్నాయి.

“మరి నువ్వో!” ప్లేటు పక్కనే ఉండటంచూసి అడిగాడు రాధ.

“నేను తిననులే. నువ్వు కానియ్.”

“అలా అయితే నేనూ తినను.” చేతులు ముడుచుకుని కూర్చున్నాడు.

“ఇంకా పసివాడిలా మారాంచేస్తే ఎలా చెప్పు!”

“పసివాడినేమిటి వదినా! డాక్టరేటుడిగ్రీపుచ్చుకున్నా తెలుసా?”

“ఏదీ! బుజావు లేనిదే?”

“అంతేనంటావా?

“అంతే మరి!”

“అయితే సరే. ప్లేటు ముందుకు లాక్కొని తినటం ఆరంభించాడు.”

“ఊఁ . . . అమెరికావిశేషాలు ఇంకా ఏమిటయ్యా! రాధా!” అచల ప్రశ్నించింది.

“ఓహ్! ఏంచెప్పమంటావ్ వదినా! కూటికీ,గుడ్డకూ వెతుక్కోనవసరం లేనిదేశం. ఎంత పురోగమించారు వాళ్ళు! అక్కడ పనిచేసేవాడికి చేయించేవాడికీ ఒక్కటే విలువ. ఆ మాటకి వస్తే పనిచేసేవాడికే ఎక్కువ విలువ. దరిద్రం అనే మాట వాళ్లకి తెలుసునా అనిపిస్తుంది. అందరూ ఎంత కష్టపడి పనిచేస్తారను కున్నావు. మనం ఉన్నాం చూడరాదూ! పనికి పోతరాజూ. తిండికి తిమ్మరాజూ అనే సామెతే ఉంది మనకు!”

“అవకాశాలు వస్తే మనవాళ్లు చెయ్యలేరంటావా?”

“అందరూ అనేమాటే ఇది వదినా! ఉన్న అవకాశాలు ఎంతమంది వినియోగించుకుంటున్నారంటావు! అక్షరం ముక్కవస్తే పొలం పేరెత్తటానికికూడా నామోషిదు నాయె మన వాళ్లకి! అంతెందుకు! ఇంతంత పథకాలు వేసి ఇన్ని ఉక్కుకర్మాగారాలు విదేశద్రవ్యసహాయంతో తెచ్చాంగదా! అక్కడ ఎంతమంది న్యాయంగా పని చేస్తున్నారు? నిజంగా పనిచేస్తే అవి ఇలాగేనా నడవవలిసింది?” ఆవేశంగా అన్నాడు రాధాకృష్ణ.

“అది కేవలం ఒకళ్లని అనలేం గదా?”

“ఇప్పుడు నేను ఎవర్నీ వేలెత్తి చూపటం లేదు. అందరూ కలిసి ఉన్నసమస్యల్ని ఎందుకు పరిష్కరించలేరూ అంట? అందరూ ఎవరికి పుట్టిన బిడ్డలా వెక్కివెక్కి ఏడ్చిందన్నట్లు చూసేవారేగాని!”

“అవుననుకో!. . . ఇంకో ఇడ్లీ వెయ్యనా!”

“ఉహూఁ. . . వద్దు కాఫీ.”

“అమ్మా! నాకే!” నాని

“నీకు ఇక చాలు. . .”

“ఊ. . . ఉహూఁ . . . ” నాని మారాం చేశాడు.

“రాధా! వీడితో ఆడకయ్యా!”

అంటే! నాని బుద్ధిమంతుడిలా చెయ్యి కడుక్కుని లేచిపోయాడు.

“అక్కడ విడాకులు చాలా ఎక్కువటగదయ్యా?” కాఫీ తాగుతున్నవాడల్లా ఒక్కక్షణం ఆగి అచల కళ్లలోకి సూటిగా చూశాడు. ఏదో ఆసక్తి ఆ కళ్లలో.

“అవును వదినా! అక్కడ వివాహవ్యవస్థ లేదు. అబ్బాయికి అమ్మాయి, అమ్మాయికి అబ్బాయి పూర్తిగా నచ్చితేనే చేసుకుంటారు. మళ్లీ వైవాహికజీవితంలో ఎవరు ఎవరికి నచ్చకపోయినా విడాకులిచ్చుసుకోవచ్చు. మనదేశంలోలాగ ఇష్టం ఉన్నా లేకపోయినా జీవితాంతం బానిసల్లా పడి ఉండనవసరం లేదు.”

“ఆ పద్ధతి అంతమంచిది అంటారా?”

“ఎందుక్కాదు వదినా! మనసులో ఇష్టంలేని వ్యక్తితో జీవితాంతం మనల్ని మనం వంచించుకుంటూ

మాటలు లేనిది రేఖాచిత్రం

—హొరేస్

నరకయాతన అనుభవించేకన్నా, ఇష్టంలేనివాడుకుండ బద్దలు కొట్టినట్లు చెప్పేసి ఎవరిదారిన వారు పోవటం మంచిది కాదంటారా!

“అలా అయితే ఇక మనిషికీ మనిషికీ అనుబంధం ఎక్కడయ్యా?”

“ఏమిటి వదినా ఈ అనుబంధం! అది పెట్టుకొని మనం ఎవరిని ఉద్ధరిస్తున్నట్లు! ఇన్ని ఆచారాలూ, ఇంతమంది దేవుళ్లూ ఇన్ని బంధనాలూ పెట్టుకుని మనం సాధించినదేమిటి? వాళ్ళు సాధించనిదేమిటి? వాళ్లని చూడు స్కైస్క్రేపర్స్ — బోయింగ్ జెట్స్ — ప్రతివాటికీ టి. వి. ఫ్రిజ్. ఓహ్ . . . లోటులేని దేశం. . .

“బయటికి అవే పరమార్థం అంటావా రాధా?”

“పరమార్థాలూ, వగైరాలు నాకు తెలియవు వదినా! పదనా నానీ ఆడుకుందాం.”

* * *

మధ్యాహ్నం ఒంటి గంట కావస్తూంది.

నాని నిద్ర పోతున్నాడు. రాధాకృష్ణ సైకాలజీ పుస్తకం చదువుతూ మంచంమీద పడుకున్నాడు. పని పూర్తిచేసుకుని వచ్చిన అచల వాలుకుర్చీలో కూచుంటూ “ఏమిటయ్యా రాధా చదువుతున్నావ్?” అన్నది.

“సైకాలజీ వదినా!”

“నాకో సందేహం. ఈ సైకాలజీ అంతా

## గర్నెపూడి
## రాధాకృష్ణమూర్తి

జీవితంలో ఉపయోగిస్తుందంటావా?"

"ఎందుకు ఉపయోగించదు?"

"పిల్లల పెంపకంగూర్చి ఇన్ని పుస్తకాలు చదివాను. అన్నిట్లోనూ పిల్లల ఒంటిమీద దెబ్బ వెయ్యకూడదనే మాత్రమే. కాని మచ్చుకు ఒక్క పిల్లని ఆ రచయితని నన్ను దెబ్బ వెయ్యకుండా పెంచమను చూద్దాం. . ."

"మరెందుకు రాస్తారు?"

"అది కేవలం హేతువాదం అంటాను."

"కాని నీ హేతుకంగా చెప్పొచ్చు!" రాధాకృష్ణ నవ్వుతూ చేశాడు.

"పెళ్లాలు చచ్చినా పురుషుడు జీవితంలో విరక్తి చెందినప్పుడూ స్త్రీ జీవితంలో ఆసక్తి చెందినప్పుడూ వివాహం చేసుకుంటారుట. కాని చివరికి ఇద్దరికీ మిగిలేది నిరాశేనట!"

"ఊఁ. . .!"

"అది శుద్ధ అబద్ధం అంటాను. అచల అన్నది రాధాకృష్ణవైపు చూస్తూ.

"ఎలా?" యథాలాపంగా ప్రశ్నించాడురాధాకృష్ణ.

"ఉదాహరణకి నా విషయం తీసుకో! నాకు జీవితంమీద ఆసక్తి పెరిగిందేకాని తరగలేదు."

ఉలిక్కిపడ్డాడు రాధాకృష్ణ. తను విన్నది నిజమేనా? తను ఏంమాట్లాడుతున్నాడో తెలిసే మాట్లాడుతున్నదా వదిన? జీవితానికిపరమావధి ఫ్రిజ్‌లూ ప్లేయర్లూ టి. వి. రెఫ్రిజిరేటర్లూ కార్లూ కావన్న వదినకు ఇంకా దేనిమీద ఆసక్తి!

"అంటే అర్థం కాలేదు వదినా!" ఆమెకళ్లలోకి సూటిగా చూస్తూ అడిగాడు.

"అంతమాత్రం అర్థం చేసుకోలేకపోతే నీ పి. హెచ్. డి. ఎందుకయ్యా? పోనీలే. విశ్రాంతి తీసుకో. వస్తా" నంటూ లోపలికి పోయింది అచల.

ఆమె వెళ్లినవైపే చూస్తూండిపోయాడు రాధ నిస్తేజంగా. తను ఆమెని [illegible] అర్థం చేసుకోలేక పోయాడా? అది వదిన తన మీదికి విసిరిన చాలెంజ్! జీవితంలో అనుబంధం లేని బంధనాలు, విమర్శించిన వదిన భోగవస్తువులు జీవితానికి పరమార్థం కావన్న వదిన జీవితంలో తనకి ఇంకా ఆసక్తి ఉందన్నది. అంతేకాకుండా తను ఆమెని అర్థం చేసుకోలేని అసమర్థుడవి అంటున్నది. అంతా అర్థంకాని క్రాసువర్డు పజిల్సులాగా ఉంది. చిన్నప్పటినుంచీ వదిన ఇంతే. అంతా పొడుపు కథలాగా మాట్లాడి అంతు తేల్చకుండా అక్కణ్ణుంచి తప్పించుకు పోతుంది. ఆమె అన్నట్లు తను ఆమెని అర్థం చేసుకోలేకపోయాడేమో!

తను అమెరికా వెళ్లిన మొదటి సంవత్సరం చివర్లో తనకి ఉత్తరం వచ్చింది. అది తను ఏదో పార్టీకి పోతున్నప్పుడు. హఠాత్తుగా అకారణంగా అన్నయ్య పోయాడని. అందులోని సారాంశం. అందులో విషయం విశదంగానే తెలుస్తున్నా కాని ఎందుకో అఘాతం తనని కదిలించి పారెయ్యలేదు. అఘాతం లాంటి వార్త మనసుకి నాటింది కాని మనసు బాధతో మెలికలు తిరగలేదు. తను నీరుగారిపోయి కుప్పగూలి పసివాడిలా బావురుమని ఏడుస్తాననుకున్నాడు రాధాకృష్ణ. అటువంటిదేమీ జరగలేదు. ఉత్తరం పట్టుకుని అలాగే చూస్తూ నుంచున్నాడు.

"ఏం జరిగింది డార్లింగ్! అంది గర్ల్‌ఫ్రెండ్ హెలెన్ ముద్దుగా.

"మా అన్నయ్య పొయ్యాడు" అన్నాడు గొంతులో జీరతో.

"ఓహ్! ఇటీజ్ టెరిబుల్ అయాం. సో సారీ . . ." అన్నది హెలెన్ ఒక్కో మాటని ఒత్తి పలుకుతూ మెలికలు త్రిప్పుతూ. హాస్టల్‌లో నలుగురికి చెప్పి వచ్చింది. స్నేహితులందరూవచ్చి తమ సంతాపం తెలియజేశారు. [illegible] బాధ పడతానని నల్లమోహమూ తోడిగించి పార్టీకి తీసుకుపోయాడు.

మరునాడు తనకితనే పరిశీలించుకుంటూంటే అనిపించింది రాధాకృష్ణకి. తను అంతగా కుప్పకూలిపోవటానికి కారణం. తను ప్రత్యక్షంగా ఆ దారుణ దృశ్యం చూడకపోవటంచేతనో సైకాలజీ చదువుతూండటంచేత తను మనస్సును స్వాధీనం చేసుకోవటం చేతనో అని. అయితే ఇందులో ఏది అయిందీ నిర్ణయించుకోలేకపోయాడు. అలానే ఆలోచిస్తూ కూర్చుంటే అనిపించింది రాధాకృష్ణకి. వదినకూ అందరిలాగానే అన్నీ త్యజించి రోజూ చన్నీళ్ళ స్నానాలూ మడికట్టుకోవటాలూ పూజాపునస్కారాలూ ఉపవాసాలూ జాగరణలూ అన్నీ చేస్తూ పిలుపు కోసం ఎదురుచూస్తూ కాలం గడిపేస్తుంది. కాబోలు! పసివాడు నానికి నాన్నలేనిలోటుగాక ఆ ఆచారాలు అన్నిటిమూలంగా వాణ్ణి సరిగా చూసుకుండే దిక్కుగూడా ఉండరు కాబోలు! తల్చుకుంటే మనసంతా సుడిగుండమై పోయింది.

అదే ఇక్కడ అమెరికాలో ఆ మాటకి వస్తే పాశ్చాత్యదేశాలన్నిటిలో జీవితం ఎంత తేడా? వదినలా చిన్నవయసులో భర్తని కోల్పోయి ఎండినమోడులా జీవితం గడపనవసరం లేదు. మనం— మనదేశం— ఎందుకు ఈ పనికిరాని ఆచారాలన్నీ! ఎవర్ని ఉద్ధరించటానికి! ఎప్పటికి మనం ముందడుగు వేసేది?

అలా పరిపరివిధాల ఆలోచనలతో "కండొలెన్స్" కార్డు పంపించాడు రాధాకృష్ణ అచలకు.

తను అక్కడ అంతగా ఊహించుకున్న వదిన దిగులుతో బాధతో కృశించిపోతూంటుందనుకున్న వదిన

మీ ముఖము మృదువుగా, మొటిమలు లేకుండా ఉంటుంది

Nital

క్రిమిసంహారకమైన మొటిమల క్రీమ్

దీనిని ఎడు 7 రోజులు మాత్రమే రాసుకొంటే మీ ముఖము మృదువుగా, మొటిమలు లేకుండా ఉంటుంది

ఈ మొటిమలను పోగొట్టే, క్రిమినాశక, కొత్త యుక్తమైన నితల్ క్రీమ్ శాస్త్రజ్ఞ ప్రశంసలను పొందింది మరియు దానిచే పిపాట్లు వేయబడుతోంది. అది అటువంటి చర్మ బాధలను పోగొట్టుటలో సహాయపడి, చర్మమును మృదువుగా చేస్తుంది. సువాసనమైన మనోహరమగు దానిని సమయములో ఉపయోగిస్తే, ముఖము మీద మచ్చలు పడవు.

తయారుచేయువారు : కొచ్చిన్ ఫామ్ ప్రైవేట్ లి., బొంబాయి-28 . కొచ్చిన్-2

మెస్సర్స్ గణపతి & కంపెనీ,
103/104, లింగి చెట్టి స్ట్రీట్,
పోస్ట్ బాక్స్ నెం. 1906, మద్రాసు-1.



3 [illegible]/78

సణసణలాడుతూ వచ్చి తనతో తర్కం చేసుకుని కూర్చుంటే అంతుబట్టలేదు రాధాకృష్ణకు.

తీరా తను ఊహించుకున్నట్లు వదిన పాతవాసనలన్నీ వదిలి కొత్తదారి తొక్కదా? అంతకంటే ఇంకేం కావాలి? బతుకంతా ఒంటరిగా నిరాశ, నిస్పృహలమధ్య గడిపేకన్న ఇలా తన బతుకుబాట నిర్ణయించుకోటం మేలుగదూ? అయితే దారినపోతూంటే వ్యలాని అతని భార్య రెండో పెళ్లి చేసుకుందని వేలెత్తి చూపి దుమ్మెత్తిపోస్తారు కాబోలు. అంతా గాలి పోగుచేసుకుని ఊరూ వాడా దాటి అందరికీ అందుతుంది కాబోలు ఈ కబురు! తను దారిన పోతుంటే చూసి ఆడుగో అతని వదినగారే మొగుడుపోతే సంవత్సరం తిరక్కముందే రెండోపెళ్లి చేసుకుని కులుకుతూంది. మన ప్రొఫెసర్‌గారు మాత్రం తక్కువ తిన్నాడా? అన్న పోయాక . . . ఎన్నెన్ని గ్రంథాలు నడిపించాడంటారు?

ఆలోచన హఠాత్తుగా తెగిపోయింది. లోకం కోడి అయి కూస్తుంది తన వెనక . . . ఏ పాపమూ ఎరగని తనమీద అభాండం! అవును వోరేగాని కళ్ళులేని లోకం అంతకన్నా ఏం చెప్పగలదు? లోకంనోరు మూయ్యడం సాధ్యమా? ఏదో పుట్టిందంటే విలువలు వలువలు కల్పించుకుని తుంగమొక్క మహావృక్షమై వేళ్ళు పాతుకుని కూచుంటుంది. వెనకటికి రాయలవారి నోట్లోంచి తాటిచెట్టు పడిందన్నట్లు

వీటన్నింటినీ ఎదుర్కొని నిలిచోవచ్చు వదిన సంతోషంగా ఉండేటట్లయితే! కాని ఆమె ధోరణి తనకి అంతు పట్టలేదా? తను ఇలా పరిశోధనచేసి సాధించిన డిగ్రీలు, చదివిన చదువూ అంతా వృథా కావలసిందేనా? తను ఆ మాత్రం అర్థం చేసుకోలేకపోతే పి. హెచ్. డి. వ్యర్థమని వదిన అననే అన్నది. అది నిజం కాకూడదు! అసంభవం! ఇంత చదువు చదివి ఒక ఆడదాని అంతర్యం అర్థం చేసుకోలేదు తను? . . . నాన్సెన్స్ . . .

* * *

"ఒక ఆట వేద్దాం వస్తావటోయ్ రాధా!" చదరంగం పావులూ బల్లా తీసుకువచ్చి అమర్చుతూ పిలిచింది అచల.

"ఒక ఆట ఏమిటి? ఎన్ని ఆటలైనా సరే. నీ యిష్టం" అంటూ హుషారుగా వచ్చి కూర్చున్నాడు రాధాకృష్ణ.

వరండాలో టీపాయ్‌మీద బల్ల — పావులూ అమర్చి చెరో స్టూలూ వేసుకుని కూర్చున్నారిద్దరూ. తెల్ల పావులు తీసుకుని ఆరంభించింది అచల.

కింగ్స్ ఇండియన్ డిఫెన్స్‌తో జవాబిస్తూ ఆట ప్రారంభించాడు రాధాకృష్ణ.

సాయంత్రం సంజచీకట్లు అలుముకున్నాయి. మసక వెలుతురులో తీక్ష్ణంగా చూస్తూ ఎత్తుకుపైఎత్తు వేస్తూ ఆడుతున్నారు ఇద్దరూ. కాలికి మెత్తగా తగులుతున్నట్లనిపించింది. చూశాడు అప్పుడే అచల కాలు వెనక్కి లాక్కుంది. క్షణం మాత్రం అనుమానంగా ఉండి ఏదీ జరుగుతున్నట్లు తెలుసుకుపోలేదు మళ్లీ ఆటలో నిమగ్నుడయ్యాడు. చీకట్లు చిక్కబడగా పెరుగుతూ పోతూ ఆట తికమకగా తారతమ్యం తెలియనిస్థితి ఏర్పడుతూన్న సమయంలో పనిమనిషి వచ్చి లైటు వెలిగించి పోయింది.

లైటువెలుతురులో చూసుకుంటే తన మంత్రి వైరివర్గంలో మధ్య వ్యూహంలో చిక్కుకుని ఉంది. ఇక వెనుదిరిగి తప్పించుకునే అవకాశం శూన్యం. రెండు చేతులా గడ్డం కింద తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. రాధాకృష్ణ.

"తప్పించవయ్యా మంత్రిని" అంటూ హెచ్చరించింది అచల.

"ఆదే ఆలోచిస్తున్నాను వదినా!" తల ఎత్తకుండా జవాబిచ్చాడు.

"ఇంకెక్కడ తప్పిస్తావు! నీ మంత్రికి మరణం ధ్రువం" అన్నది అచల నవ్వుతూ.

"ఆదే చూస్తున్నా. ఇందాక చీకట్లో సరిగా చూసుకోలేదు."

"ఆ చీకటి ఇక్కడిది కాదోయ్ మూన్‌హటన్‌లో మగువల మత్తుగొలిపే మందహాసం. ఆ సందోహంలో మసకచీకట్లు కమ్మి మంత్రిగతి మన్నుపాలయింది అవునా?"

"ఏమిటి వదినా నువ్వనేది!" తీవ్రంగా ప్రశ్నించేడు.

"అంత కోపమయితే ఎలాగయ్యా రాధా! ఎదురుగా ఉన్న వస్తువులు కంటికి ఆనక మనసు ఎక్కడో తిరుగాడుతున్నదన్నాను. అప్పటికే ఇప్పటికీమారలేదనుకో నువ్వు?"

"ఏం మారాలంటావు?"

"ముంజేతికంకణానికి అద్దం కావాలటోయ్?" చిలిపిగా చూస్తూ ప్రశ్నించింది.

"మరీ అందని నారికేళపాకం అయితే ఎలాగ వదినా!"

"చెప్పొచ్చుగదయ్యా! పి. హెచ్. డి. ఎలా వచ్చిందా నీకు అని!"

"అమ్మా! నేనుకూడా ఆడతానమ్మా!" బల్లమధ్య తట్టుని ఎత్తివేస్తూ అన్నాడు అప్పుడే ప్రవేశించిన వాసు.

"వాసూ!" అచల గొంతు ఖంగుమంది. నిశ్శబ్ద వీధిలో కల్లోలం.

వాని భయంతో రాధాకృష్ణ వెనక దాక్కున్నాడు.

"పోనీలే వదినా! చిన్నవాడు." అన్నాడు రాధ.

"అవును వాడూ చిన్నవాడు — నువ్వూ పసిపాపాయివే. ఇంకేం ఆడుకోండి!" అంటూ లోపలికి వెళ్లి పోయింది. రాధాకృష్ణ పిలుస్తున్నా వినిపించుకోకుండా.

"చిన్నాన్నా — చిన్నాన్నా — మనం ఆడదాం రావా?" వాని బతిమాలుతున్నాడు.

"ఊ. అన్నాడు పరధ్యానంగా రాధాకృష్ణ. వాని వరదాగా జంతువులన్నీ పేర్చటం మొదలెట్టాడు ఇష్టం వచ్చిన చోటల్లా.

కాలికి తగిలిన మెత్తదనం ఇంకా పలకరిస్తూనే ఉంది. వదిన అలా ఎందుకు చేసినట్లు? మన వాళ్లని గూర్చి మన ఆచారాలను గూర్చి తన ఊహలు కేవలం పుస్తకాల్లో ఊహాలేమో! అవన్నీ కేవలం అడుగున ఉండే మొసళ్లనూ మొదలైనవాటిని కప్పిపుచ్చి, నిర్మలంగా పారే నీటి ఉపరితలం అయి ఉండాలి. ఎన్ని పురాణాలూ — ఎన్ని నీతులూ చెప్పినా దేహం పుష్టికరమైన ఆహారం పడుతున్నంతకాలం కోర్కెలు ఎగసనతోస్తూనే ఉంటుంది. పాశ్చాత్యుల్ని "వాసనామయులు" అని అనడమేగాని ఆధ్యాత్మికం వేదాంతం అంటూ మనం సాధించినదేముంది? వాళ్లు ఉన్నదున్నట్లు నిజం చెప్తూంటే వాళ్లని హేళన చేస్తున్నాం. మన ఆచారాలూ, సంస్కృతీ మొదలైన బురఖాక్రింద చేసే తప్పులు కప్పెడుతూన్నాం అంతేగా!



శిలలో నుండి జలం (కపిలతీర్థం)
ఫోటో—బి. రామలింగం (మద్రాసు—21)

అయితే వదినది మాత్రం తప్పేముంది! ఆమెకు జీవితంలో కోర్కెలూ, ఆశలూ ఉంటాయి. ఉండటం తప్పుకూడా కాదు. కాని ఆమెని అలా అధోగతిపాలు చేసిన సంఘానిదే తప్పు. అందుకే వదిన తనకి జీవితం మీద ఆసక్తి పెరుగుతూందేకాని తరగడంలేదన్నది. ఇంద్రధనస్సులాంటి జీవితంలో పురివిప్పిన నెమలిలా నాట్యం చేయవలసిన తరుణంలో, సంకెళ్లువేసి, పంజరంలో పెడితే ఇంద్రధనుస్సు, అందులోని రంగులు ఎలా కన్పించకుండా పోతాయి! వాటిమీద ఆశ ఎలా తీరుతుంది?

* * *

మనిషి కదులుతున్న చప్పుడయితే మాగన్నుగా పడుకున్న రాధాకృష్ణ చటుక్కున లేచాడు. బెడ్‌లైట్ స్విచ్ వేశాడు. వదిన!

"ఇంకా నిద్రపోలేదా! సారీ రాధా! డిస్టర్బ్ చేసినందుకు" పేలవంగా నవ్వుతూ అచల —

అలాగే చూస్తూ కూర్చున్నాడు రాధాకృష్ణ.

"అ అహ . . . ఏం తోచక నిద్రపట్టకపోతేనూ ఏదైనా పుస్తకం దొరుకుతుందేమోనని వచ్చాను. నువ్వు నిద్రపోతున్నావేమో డిస్టర్బ్ చెయ్యటం ఎందుకని లైటు వెయ్యలేదు. "వస్తానయ్యా! ఇదుగో ఈ పుస్తకం తీసుకుపోతున్నా"

"లోలిత" పట్టుకెళ్లింది అచల.

లైటు ఆర్పేసి పడుకున్నాడు రాధాకృష్ణ. ఎంత ప్రయత్నించినా నిద్రరావటంలేదు. నిజంగానే నిద్ర రాకనే వచ్చిందా వదిన తన గదిలోకి! తనని నిద్రలేపనంతటి సౌమ్యురాలు కాదే! అర్ధరాత్రి వచ్చి నిద్రలేపి కూర్చోబెట్టి చదరంగం ఆడుదామనే వదిన — పుస్తకంకోసం తనను లేపటానికి సంకోచించిందా? అందులోనూ అర్ధరాత్రివేళ చదువుకొనేందుకు 'లోలిత' కావలసివచ్చింది! తను సైకాలజీమీద, రిసెర్చిచేసినా

ఎంతోమంది 'స్నేహితులు' 'మహోత్తమ సాహిత్యం' అని. పొగడిన పుస్తకం తనకి చప్పగా చొప్పదంటులా అని పించింది. 'పర్వర్టెడ్ థాట్స్' తప్ప అందులో ఒక్కటీ మనసుని కదిలించే భావమే పూజ్యం. వదిన ఇవి చదువు తున్నదా?

* * *

గడియారం బద్ధకంగా 8 గంటలు కొట్టింది. అప్పుడే భోజనం చేసివచ్చిన రాధ — ఏదో పుస్తకం తీసుకు కూచున్నాడు. కిటికీలోంచి వెన్నెల సన్నజాజుల పరిమళంతో కలిసి దోబూచులాడుతున్నది. పుస్తకం తెరిచి పట్టుకున్నాడన్న మాటేకాని రాధాకృష్ణ ఆలోచనలన్నీ ఎక్కడో ఉన్నాయి.

జీవితంలో కోల్పోయిన పెన్నిధిని ఎక్కడో వెదుకు తూంది వదిన. ఆ అన్వేషణలో అప్పుడప్పుడు అడుసులో కాలు వేస్తూంది. అది తెలిసే చేస్తున్నదని అయి ఉండాలి. తన అనుభవంతో, విజ్ఞానంతో వదిన అలాంటి పొరపాట్లు చెయ్యటం అసంభవం. కాని ఆ అన్వేషణలో వదిన తననించి ఆశించుతున్నదేమిటి? ఒకవేళ తను ఆమెని అర్థంచేసుకోలేదని అనటంలో ఆమె అంతర్యం అదికాదుగదా! అయితే తన సమాధానం! . . . . తనకన్న వయసులో ఎంతో పెద్దదికాదు ఆమె. ఆమె తననించి ఆశించేది అదే అయితే — వయసులో తేడా ఒక ఆటంకమేకాదు. తమను ఇద్దర్నీ వేలెత్తిచూపుతారు కాబోలు అందరూ! బహుశా అందరూ తన పైకాలేజీ రీసర్చి సార్థకం అయిం దంటారు. కాని, నాని భవిష్యత్తు సుస్థిరం అవుతూంది. వదిన జీవితం తిరిగి చిగురుస్తుంది. ఆమె మనసారా వాంఛించితే కాదనే శక్తి తనదగ్గిరలేదు. ఇందులో అన్నయ్యకు అన్యాయం చేస్తున్నాడా తను! ఊహూ . . . అంతగా పరిస్థితులు తమ నిద్దర్నీ ప్రశాంతంగా బతకనివ్వకపోతే, తిరిగి అమెరికా వెళ్లిపోతారు తాము ముగ్గురూ. తనకు స్టాండింగ్ స్కాలర్‌షిప్ ఉండనే ఉంది అక్కడ. కుళ్లిపోతున్న ఆచారాల మధ్య కంపు కొట్టే బతుకు విడిచిపెట్టి ఏ చీకూ చింతాలేని స్వేచ్ఛా జీవితం సాగిస్తారు.

"ఏం తోచటంలేదయ్యా రాధా!" తెల్లని చీరె వెన్నెల్లో ఇంకా తెల్లగా మెరుస్తూంటే ప్రవేశించిన అచల అన్నది.

వెనక్కు తిరిగిన రాధాకృష్ణ క్షణకాలంపాటు అలానే నిశ్చేష్టుడుగా ఉండిపోయ్యాడు. "ఏంచేద్దామంటావ్!" అన్నాడు ఏదో నిశ్చయానికి వచ్చినట్లు,

"ఏం తీరుడివోయ్! ఆమాత్రం ఆలోచించలేవూ?" అన్నది అచల కిటికీ చువ్వలు పట్టుకుని వెన్నెల్లోకి చూస్తూ.

"సినిమాకి పోదామా!"

"అలా అన్నావు బావుంది. పద."

"మరి నాని . . ?"

"వాడు తెల్లవారిందాకా నిద్రలేవడు."

"మంచి ట్రయినింగు ఇచ్చావన్నమాట!"

"మరి ఆమాత్రం ట్రయినింగు ఇవ్వకపోతే ఎలా! అవస్థపడేది నేనేగా!"

సినిమా జరుగుతూంది. రాధాకృష్ణ తెరమీద యాంత్రికంగా చూస్తున్నాడు. కుర్చీ చెయ్యిమీద అచల చెయ్యి మెత్తగా తగులుతూంది. తగులుతున్న స్పర్శ తనకి తెలుస్తూనేఉంది. అచలకి కూడా తెలిసే ఉండాలి. లేకపోతే అంతసేపుగా అలా ఉంచుతుందా! కుర్చీలో అచలవైపు ఒరిగిపోయి తెరవైపే చూస్తు న్నాడు. అచల చెయ్యి మెత్తగా, జున్నుముక్కలా! మాన్‌హటన్‌లో డ్రైవ్ ఇన్ థియేటర్సులో హెలెన్ స్పర్శకూడా ఇలానే ఉండేది. మెత్తటి తివాసీమీద ఎక్కడో అందని లోయకు ఇంకా క్రిందికి దిగిపో తున్నట్లు అనుకున్నాడు. ఆ మెత్తదనం ఇలాగే శాశ్వతంగా— అలా ఉండిపోతే ఎంత బాగుండును! ఏం ఆచారాలనూ, కుళ్ళనూ తను నిరసించలేడూ?

కథలో నాయికా నాయకులిద్దరూ ప్రణయ ఘట్టంలో మునిగిపోయి ఉన్నారు. వాళ్లిద్దరి అన్యోన్యతా చూడలేక చంద్రుడు అసూయతో మబ్బుల చాటున దాక్కున్నాడు. సరోవరం అందరికీ కబురు దించటానికి గలగల పరుగెత్తింది. ఈ సంరంభంచూసి లతాపుష్పాలన్నీ గుసగుసలాడుకుంటున్నాయ్! . . .

అచల ఆలోచన పసికట్టటానికి రాధాకృష్ణ పక్కకి తిరిగాడు. అదే సమయంలో అచల ఇటువైపు తిరిగి తియ్యగా నవ్వింది రాధాకృష్ణ కళ్లలోకిచూస్తూ. రాధాకృష్ణ అలానే అచేతనంగా చూస్తూండిపోయాడు. అచల పమిట తొలగిపోయింది. అది తిరిగి సరిచేసుకోవాలనే స్పృహకూడా ఉన్నట్లులేదు అచలకు. రాధాకృష్ణ మనసు మత్తుగా మూలిగింది. "అచలా!" అన బోయాడు. ఆ మాట పెదవులు దాటిరాలేదు.

> **ఇదీ అదీ**
>
> ఇది మృతిచెందేవారి ప్రపంచం—మరో ప్రపంచమే జీవన భూమి. —బైరన్ ఎడ్వర్డ్స్

అంతలో అచల తిరిగి తెరవైపు తిరిగింది.

ఆమె చెయ్యి మెత్తగా ఇంకా మెత్తగా తగలటం మానేసింది.

* * *

సినిమానించి రిక్షాలో తిరిగి వస్తూంటే పక్కనే అచలదేహం మెత్తగా — పాత జ్ఞాపకాలను తవ్వుతున్నది. చీకట్లో రాధాకృష్ణకళ్లముందు ఏవేవో దృశ్యాలు క్షణంపాటు కన్పించి తిరిగి మాయం అవుతున్నాయి. ఒక్కదృశ్యమూ తిన్నగా నిలవదు. ప్రక్కని మెత్తదనానికి నరాలు జివ్వునలాగుతున్నాయి. తనను తాను మరిచిపోయాడు.

అచల వెనకగా రిక్షా సీటుమీద ఉన్నచెయ్యి అప్రయత్నంగా అచల వీపుకు తగిలింది. జాకెట్‌కు, చీరకూ మధ్య నునుపు చర్మం మీద.

"సినిమా ఎలా ఉందోయ్?" అచల తనవైపు తిరిగి ప్రశ్నించింది.

"బాగానే ఉంది. క్లుప్తంగా జవాబిచ్చాడు.

తనకు అచల ముఖంలోకి చూసి జవాబిచ్చేశక్తి చాలటంలేదు. ఏదో చెయ్యాలని గుండె కొట్టుకుం టూంది. మనసు ఎక్కడినించో హెచ్చరిస్తూంది. రెండింటి సంఘర్షణలో స్థిరత్వాన్ని కోల్పోయాడు రాధాకృష్ణ.

"ఎంత బాగా ఉందని!"

"నువ్వూ చూశావుకదూ!" అతని చెయ్యి మెల్లిగా క్రిందికి జారింది. ముంజేతికి ఆమె వీపు వెచ్చగా మెత్తగా తగులుతున్నది.

"ఏ సంగతి అడుగుతున్నావోయ్!" అచల గొంతులో కొంచెం కంపనం ఉన్నట్లనిపించిందతనికి.

"నీకు తెలియకనా! నా చేత చెప్పించాలని కదూ!" అతని వేళ్ళు ఆమె నడుంచుట్టూ అల్లుకుపోయాయి. ఆమె నడుం మెత్తగా, తాచుపాము స్పర్శలాగా, వెచ్చగా, వేడి ఇసుములా తగులుతున్నది అతని చేతికి. చేతిలో రక్తం ఆ వేడికి మరిగి, వేళ్లు ఎక్కడో వెదకబోయాయి.

చటుక్కున ఆమె చెయ్యి అతని చెయ్యిపట్టుకుంది. ఏదో జరగబోతూందని ఊహించిన రాధాకృష్ణకి ఆఘాతం తగిలినట్లయింది.

"అల్లరి పనులు చెయ్యకూడదు. రాధ రాధగానే ఉండాలి. తెలిసిందా!" ఆ గొంతులో వణుకులేదు. అచలస్వరం కాదది. పాపడిని మందలించే తల్లిగొంతుక.

క్షణంలో నరాలు సడలిపోయాయి. నాగస్వరానికి నాట్యంచేసి అలసి వాలిపోయిన నాగుల్లా. వేళ్ళు నీళ్ళగా గారిపోయాయి. నోట మాటరాలేదు. తలవంచుకు కూర్చున్నాడు.

"చెప్పు. నువ్వు రాధవేనా? అవునా కాదా! కాదంటే చెప్పు— ఇక్కడే తల పగులకొట్టుకుచస్తాను" నిదానంగా ఒక్కొక్కమాటే సమ్మెటపోటులా తగ లుతున్నాయి.

"అవును — నీ రాధనే వదినా. నీరాధనే. రిక్షా చీకట్లో సాగిపోయింది.

* * *

రాత్రంతా నిద్రపట్టక పక్కమీద దొర్లిన రాధాకృష్ణకు నిద్ర మెలుకువ వచ్చేసరికి పదిన్నర అయింది. కళ్లు తెరవగానే మంచం పక్కనే స్టూలుమీద ట్రేలో కాఫీ, ఒక కవరూ ఉన్నాయ్.

కళ్లు నులుపుకొని కవరు తెరిచాడు. వణికే చేతులతో ఉత్తరం తీసి చదవటం మొదలుపెట్టాడు.

"నా ప్రియమైన రాధా!

ఆలోచనలన్నీ ఊక ఉమ్మడిగా వచ్చి పడుతూంటే ఉద్వేగం మనసును ఉక్కిరి బిక్కిరిచేస్తూంటే భావాలు భాషకు అందకుండా పోతున్నాయి. ఏం రాయాలో ఎలా మొదలుపెట్టాలో తెలీటంలేదు.

నువ్వు చిన్నప్పటినుంచీ నాకు స్నేహితుడుగా మాత్రమే పరిచయం. కాలం, కాలం తెచ్చిన మార్పులు నా దృక్పథంలో ఏమాత్రం మార్పులు తీసుకురాలేదు. ఇన్ని రోజుల ఎడబాటు తరవాత నువ్వు తిరిగి ఇంటికి వచ్చావంటే నా మనస్సు సంతోషంతో గంతులువేసింది. ఆ పరిపూర్ణ సంతోషంలో ఏం చేసినా నువ్వు నావెనకటి రాధవేననే ఉద్దేశ్యంతో చేశానుగాని మరేంలేదు. ఒకవేళ నీకు అన్యభావం కలిగించేట్లు ఎప్పుడైనా ప్రవర్తించి ఉంటే ఆ తప్పునాదే. అందుకుపూర్తిగా క్షంతవ్యురాల్ని. నా దృష్టిలో నువ్వూ, నానీ ఒకటే. ఇద్దరిలోనూ తేడా కన్పించలేదు నాకు.

ఇప్పటికీ ఇక ఎప్పటికీ నువ్వు నా వెనకటి రాధవేనని నా భావన. అవునా! నా రాధవేకదూ? . . "

వదిన."

'అ . . . వు . . . ను . . .' రాధాకృష్ణ పెదవుల ప్రయత్నంగా కదిలాయి. ★